సాక్షి
గుంటూరు
ఆదివారం । 7 । జనవరి । 2024



సరిహద్దు వద్ద తనిఖీలు

దాచేపల్లి : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పొందుగల సరిహద్దు చెక్‌పోస్టు వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి తనిఖీలు జరిపారు.



రూ.2లక్షలు విరాళం

శావల్యాపురం: వినుకొండలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి కారుమంచికి చెందిన వుట్ల సుబ్బారావు కుటుంబసభ్యులు రూ.2,01,116 అందజేశారు

చందన అలంకరణలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారిని చందనంతో అలంకరించారు. ఆదివారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

గోదాదేవికి సారె సమర్పణ



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రిపై నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శనివారం గోదాదేవికి భక్తులు సారెను సమర్పించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళ శాసనాలతో ధనుర్మాస మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దానిలో భాగంగా శనివారం గోదాదేవికి భక్తులు సారె సమర్పించారని తెలిపారు. ఉదయం అమ్మవారికి అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలియజేశారు.

జిల్లాలో 26 మంది ఎస్‌ఐల బదిలీలు

నగరంపాలెం: గుంటూరు జిల్లా పరిధిలోని 26 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న 11 మంది ఎస్‌ఐలకు కూడా పోస్టింగ్‌లు కల్పించారు.

నేడు తనికెళ్ల భరణికి జీవిత సాఫల్య పురస్కారం

అద్దంకి: పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ-2024 జీవిత సాఫల్య పురస్కారానికి నటుడు, కవి, సినీ, నాటక రచయిత, దర్శకుడు, నంది పురస్కార గ్రహీత తనికెళ్ల భరణిని ఎంపికచేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం అద్దంకిలోని కామినేని కల్యాణ మండపంలో పురస్కార సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ట్రస్టు 2004లో ప్రారంభించి, లబ్ధప్రతిష్టులైన కవులు, కళాకారుల్ని సన్మానిస్తున్నామని తెలియజేశారు. పురస్కారం కింద రూ.20 వేలు, పట్టు వస్త్రాలను గ్రహీతకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ మండల దీక్షలు ప్రారంభం



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఓం శ్రీఅమ్మయే శరణం తిరుపతాంబ.. ఓం శ్రీస్వామియే శరణం గోపయ్య.. అన్న శరణుఘోషతో ఆలయం మార్మోగింది. పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్షల మాలధారణ కార్యక్రమం శనివారం వైభవంగా ప్రారంభమైంది. ముందుగా ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఎదుట ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, అధికారుల సమక్షంలో అర్చకులు మాల వేసుకుని దీక్షధారణను ప్రారంభించారు. వచ్చిన భక్తులకు మాలలు వేశారు. గత ఏడాది కంటే ఈసారి మొదటి రోజునే పెద్ద సంఖ్యలో స్వాములు మాలలు వేసుకోవడం విశేషం. మండల దీక్షల స్వీకరణకు ఈ నెల 12వ తేదీ వరకు అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. రోజూ ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాలధారణ ఉంటుందని చెప్పారు. దీక్షాస్వాములకు ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన పాకల మాల్యాద్రి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కాకాని అలేఖ్య, బెజవాడ శ్రీనివాసరావు, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

టిడ్కో అనుగృహయోగం

- అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలో ఇళ్లు ప్రారంభం
- ప్రజల సొంతింటికల జగనన్నతో సాకారం: ఎమ్మెల్సీ అప్పిరెడ్డి
- పేదల ఇళ్లకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత: కలెక్టర్
- పేద, మధ్యతరగతికి చెందిన 6,080 మందికి ఇళ్ల పంపిణీ





టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ శిలాఫలకం వద్ద విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి , కమిషనర్ కీర్తి, మేయర్ కావటి

గుంటూరు రూరల్: అడవితక్కెళ్లపాడులో టిడ్కో ఆధ్వర్యంలో నిర్మించిన ప్రధాన మంత్రి అవాస్ యోజన (అర్బన్) జగనన్న నగర్ హౌసింగ్ పథకంలోని గృహ సముదాయంలో ఫ్లాట్లను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు మద్దాళి గిరిధర్, కమిషనర్ కీర్తి చేకూరి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా, టిడ్కో కార్పొరేషన్ చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌తో కలసి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గృహ సముదాయాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. లబ్ధిదారులతో కలసి శాస్త్రోక్తంగా పూజలు చేసి గృహ ప్రవేశాలు చేశారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న వారికి ఇంటి స్థలాలతో పాటు, పీఎంఏవై(యు) జగనన్న నగర్ హౌసింగ్ పథకం గృహ సముదాయంలో నిర్మించిన ఫ్లాట్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. టిడ్కో గృహ సముదాయాల్లో 300 చదరపు గజాల ఫ్లాట్లకు సంబంధించి అడవితక్కెళ్లపాడులో 2,256 , వెంగళాయపాలెంలో 416 ఫ్లాట్ల నిర్మాణానికి అయిన పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరించిందని తెలిపారు. ఒక్క రూపాయి చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసి, లబ్ధిదారులకు ఉచితంగానూ అందిస్తోందని చెప్పారు. వీటితో పాటు 365, 430 చదరపు గజాల్లోని ఫ్లాట్లలో గత ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే లబ్ధిదారు ముందుగా చెల్లించాల్సిన వాటాను 50 శాతం వసూలు చేస్తున్నారని వివరించారు.

సకల సౌకర్యాల కల్పన

జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయంలోని 7,472 ఇళ్లను పంపిణీ చేయడానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. అడవితక్కెళ్లపాడులో 4,192, వెంగళాయపాలెంలోని 1,888 కలిపి మొత్తం 6,080 ఇళ్లకు మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ, మురుగునీరు శుద్ధి ప్లాంటు, రహదారులు తదితర మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించి లబ్ధిదారులకు నేడు అందిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ నివసించనున్న కుటుంబాలలోని దాదాపు 15,000 మంది జనాభాకు అనుగుణంగా హెల్త్ సెంటరు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

కుటుంబాల్లో పండగ

మేయరు కావటి శివనాగ మనోహరనాయుడు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల్లో ఫ్లాట్ల పంపిణీతో లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులను ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పాత బకాయిలు చెల్లించి పనులు ప్రారంభించటంతో పాటు, గృహ సముదాయాలకు మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు.ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడులోని గృహ సముదాయానికి రూ.1.5 కోట్లతో జగనన్న మహిళా మార్ట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులతోనే రెసిడెన్షియల్ వెల్ఫేర్ కమిటీల్ని ఏర్పాటు చేస్తామని, వాటి ఆధ్వర్యంలో గృహ సముదాయాలను నిర్వహణ చేసుకోవాలని సూచించారు.

ఇంటి ముంగిట్లోకి సంక్షేమ పథకాలు

ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏకంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందించారని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటి ముందుకు అందజేస్తున్నారని చెప్పారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా మాట్లాడుతూ మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, నేతలు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, ఫ్లాట్ల తాళాల్ని అందించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చీఫ్ ఇంజనీరు గోపాలకృష్ణారెడ్డి, డైరెక్టర్లు రాఘవరావు, కానూరి నాగేశ్వరి, డిప్యూటీ మేయరు బాల వజ్రబాబు, కార్పొరేటర్ స్మిత పద్మజ, మెప్మా పీడీ వెంకటనారాయణ, డిప్యూటీ కమిషనర్లు వెంకటకృష్ణయ్య, శ్రీనివాసరావు, టిడ్కో, నగరపాలక సంస్థ అధికారులు, కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ తుది రాత పరీక్షల్లో 72 మంది అర్హత

8న గుంటూరు రేంజ్ కార్యాలయానికి రావాలి

నగరంపాలెం: స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్‌ఎల్‌పీఆర్‌బీ) ఆధ్వర్యంలో ఎస్‌ఐ (సివిల్/ ఏపీఎస్పీ) ఉద్యోగాలకు నిర్వహించిన తుది రాత పరీక్షల్లో 72 మంది అర్హత సాధించారు. అర్హత పొందిన రిజిస్టర్ నంబర్ అభ్యర్థులు ఈనెల 8న ఉదయం 10 గంటలకు ఒరిజినల్స్ సర్టిఫికెట్స్, రెండు సెట్ల నకలు కాపీలతో గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో హాజరవ్వాలని గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీలో సాధారణ చార్జీతోనే సంక్రాంతి ప్రయాణం

పాత గుంటూరు: సంక్రాంతి పురస్కరించుకొని దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం సాధారణ చార్జీతోనే 135 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై, తిరుపతి, బెంగుళూరు, హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 10వ తేదీ నుంచి 13 వరకు ప్రతి రోజూ బస్సుల్ని అదనపు చార్జీలు లేకుండా నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలియజేశారు. సంక్రాంతి పండుగ ముగిసిన తరువాత ప్రయాణికుల తిరుగు ప్రయాణ రద్దీని దృష్టిలో పెట్టుకొని 16వ తేదీ నుంచి 18 వరకు జిల్లాలోని ఐదు బస్ స్టేషన్ల నుంచి హైదరాబాదు, చెన్నై, తిరుపతి, బెంగుళూరు, విశాఖపట్నాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. వీటికి కూడా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, రానూ పోనూ టికెట్ రిజర్వేషన్ చేసుకొన్న వారికి 10శాతం రాయితీ ఇవ్వనున్నట్లు రవికాంత్ పేర్కొన్నారు.

త్రోబాల్ జిఖేల్

కల్పనకు ఆటలంటే ప్రాణం...తోటి ఆడపిల్లలు కలసిరాకున్నా రోజూ కొంతసేపన్నా ఒక్కత్తె బంతి విసురుతూ గడిపేది. ఆటలో ప్రావీణ్యం సాధించాలని భావించి, త్రోబాల్ సాధన ఆరంభించింది. జిల్లాస్థాయి పోటీల్లోనే తనలోని సత్తా చాటింది. ఏకంగా రాష్ట్ర జట్టుకు ఎంపికై జట్టుకు వరుస విజయాలను అందించింది. ఫలితం.. భారత త్రోబాల్ జట్టుకు ఎంపికైంది. దుబాయ్‌లో జరగనున్న సౌత్‌వెస్ట్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌కు ఆడనుంది.



చల్లా కల్పన

- త్రోబాల్ క్రీడలో ఆణిముత్యం చల్లా కల్పన
- ఆటపై ప్రాణంతో సాధన చేసి వరుస విజయాలు
- భారత జట్టుకు ఎంపిక
- తొలిగా అంతర్జాతీయ పోటీల్లో ఆడే అవకాశం

తెనాలి: పేదింటి క్రీడా కుసుమం చల్లా కల్పన. సొంతూరు గుంటూరు. అక్కడే జేకేసీ కాలేజీలో బీసీఏ ఫైనలియర్ చదువుతోంది. తల్లిదండ్రులు సునీత, వెంకటేశ్వరరావు. నలుగురు సంతానంలో రెండో కుమార్తె కల్పన. హైస్కూలులో ఉండగానే తనకు బంతితో అనుబంధం ఏర్పడింది. ఎనిమిదో తరగతిలో ఉండగా, స్కూలు ఆవరణలో కనిపించిన బంతిని ఏ క్షణాన పట్టుకుందోగానీ, జీవితంలో చదువుతో పాటు అది కూడా భాగమైంది. అప్పుడే త్రోబాల్ ఆడటం ఆరంభించింది. స్కూలు పోటీల్లో అందరూ బాగా అడావ్ ! అంటే మురిసిపోయింది.

నిత్యకృత్యంగా సాధన

కేవలం ఆడటంతోనే సరిపెట్టుకోకుండా త్రోబాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని నిర్ణయించుకుంది కల్పన. భారత త్రోబాల్ జట్టు కెప్టెన్‌గా చేసి పలు విజయాల్ని సాధించిపెట్టిన చావలి సునీల్ శిష్యరికం వరమైంది. భాష్యం గ్రౌండ్‌లో సునీల్ నేతృత్వంలో సాధన నిత్యకృత్యమైంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేస్తూ వచ్చింది. మరోవైపు పోటీల్లోనూ పాల్గొంటోంది. జూనియర్ కేటగిరీ అయినప్పటికీ జూనియర్, సీనియర్ కేటగిరీల్లో పాల్గొంటోంది.

పలు పోటీల్లో సత్తా

ఈ క్రమంలో తమిళనాడులో జరిగిన జాతీయ జూనియర్స్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లోనూ, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ సీనియర్స్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లోనూ కల్పన పాల్గొంది. చక్కని ప్రతిభను ప్రదర్శించి జట్టు విజయానికి తోడ్పడిందన్న అభినందనలు అందుకొంది. ఆ రెండు జాతీయ టోర్నమెంట్లలో ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. సీనియర్ జట్టు విజయంతో ఆ జట్టులో క్రీడాకారిణి అయిన కల్పనను భారత జట్టుకు ఎంపిక చేశారు. ఆసియన్ త్రోబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2–4 తేదీల్లో దుబాయ్‌లో జరగనున్న సౌత్‌వెస్ట్ ఆసియన్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు భారత మహిళా జట్టు ఆడనుంది. దీనికిముందుగా ఈనెల 28,29,30 తేదీల్లో బెంగళూరులోని గోపాలన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శిక్షణ శిబిరానికి హాజరుకానుంది.

స్పాన్సర్లు ప్లీజ్ !

పోటీలకు హాజరయ్యేందుకు విమానం టికెట్, వీసా ఫీజు, యూనిఫారం, శిక్షణ శిబిరం ఖర్చులకు రూ.75 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రకారం ఫెడరేషన్ ఇప్పటికే లేఖ రాసింది. కల్పన తండ్రిది చిన్న వ్యాపారం. రోజువారీ ఖర్చులకే ఆదాయం సరిపోతోంది. ఇప్పుడు ఇంత డబ్బు పెట్టి అంతర్జాతీయ పోటీలకు పంపడమెలాగ అనుకుంటూ ఆ కుటుంబం మథనపడుతోంది. స్పాన్సర్లు ఎవరైనా ముందుకొచ్చి ఆదుకోవాలని కల్పన కోరుకుంటోంది.

జాతీయ స్థాయిలో గుంటూరుకు ప్రత్యేక గుర్తింపు

- స్వచ్ఛ నగరాల జాబితాలో అవార్డు
- గార్బేజ్ ఫ్రీ సిటీ కింద 5 స్టార్ రేటింగ్
- ఓడీఎఫ్‌లోనూ 2 ప్లస్

నెహ్రూనగర్: జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 2022లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశంలోనే గుంటూరు నగర పాలక సంస్థ మాత్రమే 3వ స్థానం దక్కించుకున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ స్వచ్ఛ నగరాల జాబితాలో జాతీయ స్థాయిలో గుంటూరుకు అవార్డు వచ్చిందని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ నగరాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతితో పాటు గుంటూరుకు కూడా అవార్డు వచ్చిందన్నారు. ఈ నెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వివరించారు. గార్బేజ్ ఫ్రీ సిటీ కింద 5 స్టార్ రేటింగ్, ఓడీఎఫ్ కేటగిరిలో 2 ప్లస్ దక్కించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడంలో సహకరించిన సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా నగర ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

మాతా, శిశు మరణాల తగ్గింపే లక్ష్యం

నూతన డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్ర విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: మాతా శిశు వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా పనిచేస్తానని నూతనంగా డీఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కొర్ర విజయలక్ష్మి చెప్పారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు వద్ద నుంచి రెగ్యులర్ డీఎంహెచ్ఓగా డాక్టర్ విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఫుల్ అడిషనల్ చార్జ్ డీఎంహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నేడు ప్రభుత్వం రెగ్యులర్ డీఎంహెచ్ఓగా డాక్టర్ విజయలక్ష్మిని నియమించింది. ఈసందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్–2లో భాగంగా ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశమై టీమ్ వర్క్‌గా పనిచేసి ఆరోగ్య కార్యక్రమాల లక్ష్య సాధనలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ స్పెషాలిటీ వైద్య సేవలు ఇళ్ల వద్దే అందేలా చర్యలు చేపడతామన్నారు.

బోదవ్యాధి నిర్ధారణ పరీక్షలకు సహకరించండి

తెనాలిఅర్బన్: బోద వ్యాధి నిర్ధారణకు సంబంధించిన రక్తసేకరణ జరుగుతుందని ప్రజలందరూ సహకరించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఐతానగర్‌లో ఇంటింటికి రక్తసేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోద వ్యాధి నిర్ధారణకు రాత్రి సమయంలోనే రక్తాన్ని సేకరణ సేకరించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. అలా చేయడం వలన మానవరక్తంలో ఉన్న మైక్రో ఫైలేరియా క్రిమిని గుర్తించవచ్చని చెప్పారు. సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి, గుంటూరు

EA 14/2023 in EP 48/19 OS 173/18

Between

చిన్నకోట నాగరాజు ... DHR

ఎదిరి

పిడుగు లక్ష్మీకాంత్ ... JDR

నోటీసు

పై నెంబరు EP ని DHR డిక్రీబాకీ వసూలు నిమిత్తం JDR వారి సంబంధించిన EP షెడ్యూలు దాఖలు చేసిన ఆస్తి జప్తు ఐనది, తదుపరి వేలం జరిపి తద్వారా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసినారు. సదరు EP ని కోర్టు వారు డిస్మిస్ గా కొట్టివేయగా సదరు EP ని రిస్టోర్ చేయుటకు కోరుతూ పైతెలిపిన EA ని దాఖలు చేయగా, పలు పర్యాయములు నోటీసులు JDR కు అందక పోవడం వలన పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయుచున్నాము. కావున JDR మీరు ది. 28-01-2024న ఉదయం 10.30గం॥ లకు పై తెలిపిన కోర్టు నందు హాజరయి ఏదేని అభ్యంతరాలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది : 28-01-2024

JDR అడ్రస్: పిడుగు లక్ష్మీకాంత్, [illegible] D No 25 18 103, [illegible], గుంటూరు

కొప్పుల కిరణ్‌బాబు న్యాయవాది
గుంటూరు. సెల్ : 9000336264

పత్రికా ప్రకటన

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలంలోని విప్పర్లపల్లి అగ్రహారం గ్రామం నందు గల ఈనాం భూములను రైత్వారి పట్టా భూములుగా మార్పు చేయు సందర్భంలో ఈనాం ఏబాలిషన్ ఆక్ట్ 1956 నందు పొందుపరచబడిన అంశములను పరిగణలోనికి తీసుకొని, విప్పర్లపల్లి గ్రామం నందలి భూములకు సర్వే జరిపిన పిదప రొంపిచర్ల మండల తహసీల్దారు వారు, గ్రామ పెద్దలు, ఈనాందార్లు మరియు సంబంధిత సాగు దార్ల యొక్క సమక్షంలో ది.15-07-2023న గ్రామ సభను నిర్వహించి వారి అనుభవంలో గల భూముల యొక్క వివరములు అనగా సర్వే నెం. మరియు విస్తీర్ణములతో కూడిన ఫారం-V నోటీసును సాగు దారులకు వ్యక్తిగతంగా ఇవ్వడం జరిగింది. రైత్వారీ పట్టాలు మంజూరు చేయు సందర్భంలో సంబంధిత అనుభవదారులు మరియు గుర్తించబడిన ఈనాందార్లు వారికి ఇచ్చిన ఫారం-V నందు పొందుపరచబడిన వివరములలో అభ్యంతరములు ఏమైనా ఉన్న యెడల మరియు ఇంకా ఎవరైనా ఈనాందార్లు /అనుభవదారులు వున్న యెడల ఈ సాగు భూములకు సంబంధించి ఏ విధమైన అభ్యంతరములైనను ఈ పత్రికా ప్రకటన జారీ చేసినది మొదలు 15 రోజుల లోపల వారి యొక్క అభ్యంతరములను రాతపూర్వకంగా సంబంధిత ద్రువపత్రములను జత పరచి శ్రీయుత తహసీల్దారు రొంపిచెర్ల కార్యాలయమునకు పనివేళలో స్వయంగా గాని లేదా పోస్ట్ ద్వారా గాని పంపవలసినదిగా కోరుచున్నాము. లేనిచో ఈనాం ఏబాలిషన్ ఆక్ట్ 1956 నందు పొందుపరచబడిన అంశములను పరిగణలోనికి తీసుకొని తదుపరి చర్యలు తీసుకొనబడునని ఈ పత్రికా ప్రకటన ద్వారా అందరికి తెలియపరచడమైనది.

ఇట్లు, శ్రీయుత తహసీల్దారు వారు, రొంపిచర్ల